www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 26 డిసెంబర్ 2023

5

ఏలూరు

మట్టి అక్రమ తవ్వకాలను ఉపేక్షించం : కలెక్టర్

ఏలూరు:జిల్లాలో అక్రమంగా మట్టితవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో చొదిమెళ్ల, దుగ్గిరాలలో జిల్లా యంత్రాంగం ఆదివారం అర్ధరాత్రి దాడులు నిర్వహించింది. పోలీసులతో పాటు ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖజావలి, హౌసింగ్ పిడీ కె.రవికుమార్, ఏలూరు మునిసిపల్ కమిషనర్ ఎస్.వెంకట కృష్ణ వెళ్లి తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అక్రమంగా మట్టి తరలిస్తున్న పది టిప్పర్లను సీజ్ చేసి, కేసు నమోదు చేశారు. వీటిని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మట్టి అక్రమ తవ్వకాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. రాత్రిళ్లు మట్టి అక్రమ తవ్వకాలపై యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాల కోసం లబ్ధిదారులు స్వయంగా మట్టిని తీసుకెళ్లేందుకు మాత్రమే అనుమతులిచ్చామన్నారు. అది కూడా కేవలం పగటిపూట ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు మాత్రమేనన్నారు. లబ్ధిదారుల ముసుగులో అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు తప్పవన్నారు.

జలుబు, గొంతునొప్పి, జ్వరం..!

పెరిగిన చలి తీవ్రత.. ఫ్యాన్ వేయాలంటేనే వణుకు

అనారోగ్య సమస్యలతో జనం తీవ్ర ఇబ్బందులు

కిటకిటలాడుతున్న ఆసుపత్రులు, మందుల దుకాణాలు

సాయంత్రం ఆరు తర్వాత బయట తిరగలేని పరిస్థితులు

మరోపక్క వెంటాడుతున్న కరోనా హెచ్చరికలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

శీతాకాలం చలిగాలులు రోజురోజుకీ పెరుగుతున్నాయి. గడిచిన వారం రోజులుగా చలిపులి జిల్లా ప్రజానీకాన్ని వణికిస్తోంది. రెండు జిల్లాల్లో రాత్రి వేళల్లో ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్నాయి. దీంతో పగలు, రాత్రుళ్లు సైతం ఫ్యాన్ వేయాలంటేనే వణికిపోతున్న పరిస్థితి ఉంది. వృద్ధులు, పిల్లలు మరింత ఇబ్బందులు పడుతున్నారు. చలి తీవ్రత పెరగడంతో జనాన్ని అనారోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. జలుబు, గొంతునొప్పి, జ్వరం, కఫం వంటి సమస్యలతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండు జిల్లాల్లో ప్రతి కుటుంబంలోనూ ఒకరిద్దరు జలుబు, గొంతునొప్పి, జ్వరం వంటి సమస్యలతో బాధ పడుతున్నారు. రోజులు తరబడి అనారోగ్య సమస్యలు తగ్గడం లేదు. దీంతో ఆసుపత్రులు, మెడికల్ స్టోర్లు జనాలతో కిటకిటలాడుతున్నాయి. ఇదే అదనుగా ప్రయివేటు ఆసుపత్రుల్లో పరీక్షల పేరుతో రోగులను నిలువు దోపిడీ చేస్తున్నారు. సాధారణ జ్వరానికి కూడా రూ.నాలుగైదు వేలు పిండేస్తున్నారు. ఒకపక్క తీవ్రమైన చలి, మరోపక్క జలుబు, జ్వరం వంటి అనారోగ్య సమస్యలతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు సైతం జనాలతో నిండిపోతున్నాయి. వేడినీళ్లు తాగడం, ఆవిరి పట్టడం వంటివి చేస్తూ ఉపశమనం పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కరోనా వ్యాపిస్తుందనే ప్రచారం జనాలను ఆందోళనకు గురిచేస్తోంది. ఏలూరు జిల్లాలో గడిచిన వారం రోజుల్లో ఒక కరోనా కేసు నమోదైంది. అయినప్పటికీ కరోనాపై జరుగుతున్న ప్రచారంతో జనంలో ఆందోళన నెలకొంది. జ్వరం, గొంతునొప్పి వంటి లక్షణాలు కరోనాకు దగ్గరగా ఉండటంతో అందరినీ భయం వెంటాడుతోంది. కరోనా కొత్త వేరియంట్‌తో ఇబ్బంది లేదని, ఇది సాధారణంగా వచ్చి తగ్గిపోతుందని వైద్యాధికారులు చెబుతున్నారు. అయినప్పటికీ జనాలను మాత్రం కరోనా భయం వీడటం లేదు. సాయంత్రం ఆరు తర్వాత చలికి బయటకు తిరగాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాలంటే చెవులు, శరీరానికి చలిగాలులు తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. రాత్రిపూట ప్రయాణాలు మానుకోవాలని చెబుతున్నారు. వృద్ధులు, పిల్లలను మరింత జాగ్రత్తగా చూసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. చలిగాలుల ప్రభావం వృద్ధులు, పిల్లలపైనే ఎక్కువగా ఉంటుంది. ఇమ్యూనిటీ తక్కువగా ఉండటంతో త్వరగా వృద్ధులు, పిల్లలను అనారోగ్య సమస్యలు చుట్టుముడతాయని వైద్యులు చెబుతున్నారు. ఆహారం కూడా వేడిగా తినాలని సూచిస్తున్నారు. కూల్‌డ్రింక్స్ వంటి శీతలపానీయాల జోలికిపోకూడదని చెబుతున్నారు. జలుబు, గొంతునొప్పి వంటి సమస్యలు చలి తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు సర్వసాధారణమని, కంగారు పడాల్సిన పనిలేదని అంటున్నారు. నాలుగైదు రోజులపాటు తగిన జాగ్రత్తలు తీసుకుని, మందులు వాడితే తగ్గిపోతుందని, ఆందోళన చెందవద్దని సూచిస్తున్నారు. తుపాను ప్రభావంతో ఖరీఫ్ మాసూళ్లు పూర్తికాకపోవడం, దాళ్వా సాగుకు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఉదయం పొలం వెళ్లే వ్యవసాయ కూలీలు చలిగాలులకు తీవ్ర ఇబ్బందులు పడటమే కాకుండా అనారోగ్య బారిన పడుతున్నారు. చలిగాలులతో వెంటాడే అనారోగ్య సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యఆరోగ్యశాఖ ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంది. అప్పుడే ప్రయివేటు ఆసుపత్రుల్లో జరిగే దోపిడీకి అడ్డుకట్ట పడే అవకాశం ఉంది.

ఆడుదాం-ఆంధ్రాకు 1.47 లక్షల మంది నమోదు

నేటి నుంచి 47 రోజుల పాటు ఆటల పోటీలు

320 ఆట స్థలాలు సిద్ధం

క్రీడల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

క్రికెట్, వాలీబాల్, కోకో, కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలకు 14,354 టీముల ఏర్పాటు

కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

క్రీడాసామగ్రితో కలెక్టర్, జెసి, ఎస్‌పి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఈనెల 26వ తేదీ నుండి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని అందరి సమన్వయంతో పండుగ వాతావరణంలో సజావుగా నిర్వహించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లపై జిల్లా అధికారులు, క్షేత్రస్థాయి అధికారులతో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జెసి బి.లావణ్యవేణి ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సమర్థవంతంగా నిర్వహించేందుకు దిశ నిర్దేశం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 26న ప్రారంభం కానున్న ఈ కార్యక్రమాన్ని సిఎం జగన్ ప్రారంభించనున్నారు. ఏలూరులోని అల్లూరి సీతారామరాజు స్టేడియంలో ఉదయం 9.30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం – ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని, గతంలో ఎన్నడూ జరగని విధంగా పెద్దఎత్తున ఐదుస్థాయిల్లో జరుగుతోందని, ఇందులో ఆసక్తిగల క్రీడాకారులను, ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. టోర్నమెంట్‌లో క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్ వంటి ప్రధాన క్రీడలు గ్రామ, వార్డు సచివాలయం, మండలం, నియోజకవర్గం, జిల్లా, రాష్ట్రస్థాయిలో జరుగుతాయన్నారు. ఈనెల 26వ తేదీన మంగళవారం నుండి 605 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో క్రీడాపోటీలు సజావుగా నిర్వహించాలన్నారు. క్రీడా సంబరాల్లో పాల్గొనేందుకు 1,47,000 మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారన్నారు. జిల్లాలోని గ్రామ సచివాలయ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు క్రీడా పోటీల నిర్వహణ కోసం 320 ఆట స్థలాలను సిద్ధం చేశామన్నారు. ఇందులో క్రికెట్, వాలీబాల్, కోకో, కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించేందుకు 14,354 టీములను ఏర్పాటు చేశామన్నారు. 7,198 మ్యాచులను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయగా 8,670 మంది పురుషులు 4,484 మ్యాచ్‌ల్లో, 5684 మంది మహిళలు 2,714 మ్యాచ్‌ల్లో పాల్గొంటారని తెలిపారు. ఇప్పటికే మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి క్రీడల నిర్వహణ కమిటీలు ఏర్పాటు చేశామని సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని పోటీలు సజావుగా జరిగేలా చూడాలన్నారు. జిల్లాలో ఎంపిక చేసిన 320 ఆట స్థలాల్లో పోటీల నిర్వహణకు ఇబ్బందులు ఉండకూడదన్నారు. ఆటస్థలాల్లో అవసరమైన మౌలిక సదుపాయాల ఏర్పాటుతో పాటు ఎప్పటికప్పుడు పారిశుధ్యం నిర్వహించాలన్నారు. ఫ్లెక్సీలు, బ్యానర్లు, మస్కట్లు, తదితర ప్రచార సామగ్రి విస్తతంగా వినియోగించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ క్రీడా సంబరాల్లో భాగంగా క్రికెట్ పురుషుల విభాగంలో 2,419 మ్యాచ్‌లకు 1318 టీమలు ఏర్పాటు కాగా, మహిళల విభాగంలో 311 మ్యాచ్‌లకు గాను 108 టీములు ఏర్పాటు చేశామన్నారు. బ్యాడ్మింటన్‌లో పురుషుల విభాగంలో 2,885 మ్యాచ్‌లకు 1,520 టీములు, మహిళల విభాగంలో 3012 మ్యాచ్‌లకు 1,565 టీములను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాలీబాల్‌లో పురుషుల విభాగంలో 1742 మ్యాచ్‌లకు 911 టీములు, మహిళల విభాగంలో 395 మ్యాచ్‌లకు 140 టీములు, కబడ్డీలో పురుషుల విభాగంలో 1235 మ్యాచ్‌లకు 597 టీములు ఏర్పాటు కాగా, మహిళల విభాగంలో 805 మ్యాచ్‌లకు 344 టీములు ఏర్పాటు చేసినట్లు వివరించారు. అలాగే ఖోఖోలో పురుషుల విభాగంలో 419 మ్యాచ్‌లకు 138 టీములు, మహిళల విభాగంలో 1161 మ్యాచ్‌లకు 547 టీములు ఏర్పాటు చేశారమన్నారు. జెసి లావణ్యవేణి మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉత్సాహంగా ఉండాలని క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఈ కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఎన్.రమేష్

గ్రీన్ సిటీ పార్కు స్థలంపై పెద్దలకన్ను

హైకోర్టు ఆర్డరున్నా పట్టించుకోని పాలకులు

కెకెఆర్ గ్రీన్‌సిటీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్ఎన్.రమేష్

ప్రజాశక్తి - ఏలూరు

పార్కులను అభివృద్ధి చేయాల్సిన ఏలూరు నగరపాలకసంస్థ ఆ పని చేయకపోగా పార్కులకోసం కేటాయించిన స్థలాలను ప్రయివేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తుందని కెకెఆర్ గ్రీన్‌సిటీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్ఎన్.రమేష్ విమర్శించారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక మినీబైపాస్‌లోని గ్రీన్‌సిటీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేషన్ చర్యలను స్థానికులు అడ్డుకుని హైకోర్టును ఆశ్రయించి ఆర్డర్ తెచ్చినా పట్టించుకోని పాలకులు కోర్టు ధిక్కారానికి పాల్పడుతున్నారన్నారు. ఏలూరు నగరపాలకసంస్థ పరిధిలోని కెకె.రాజు గ్రీన్‌సిటీలో సుమారు 750 చదరపు గజాల స్థలాన్ని పార్కు కోసం 2003లో వెంచర్ వేసి కేటాయించారన్నారు. ఆ తరువాత ఆ స్థలాన్ని అభివృద్ధి చేసి అక్కడ పార్కు నిర్మించాలని నగరపాలక సంస్థకు అప్పగించారని, ఐతే నాటి నుండి గ్రీన్ సిటీలో దాదాపు 600 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలోనే గ్రీన్ సిటీ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేసుకున్న గ్రీన్ సిటీవాసులు పార్క్, రోడ్ల అభివృద్ధికి నగరపాలక సంస్థను ఆశ్రయించారని తెలిపారు. అయితే ఎలాంటి అభివృద్ధి చేయకపోగా పెద్దల కన్ను ఆ స్థలంపై పడిందని, ఈ క్రమంలో నగరపాలకసంస్థలో కొంతమంది అధికారులు ఏలూరులోని అధికార పార్టీ నేతలు కుమ్మక్కై పార్కు స్థలాన్ని కాజేసేందుకు సిద్ధమై ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌కు 750 గజాల స్థలాన్ని కేటాయిస్తున్నట్లు కౌన్సిల్లో తీర్మానం చేసేశారని, ఈ విషయం తెలుసుకున్న కాలనీవాసులు అసోసియేషన్ తరపున హైకోర్టును ఆశ్రయించి తీర్మానాన్ని రద్దు చేయించి స్థలాన్ని యథావిధిగా ఉంచాలని ఆర్డర్ తీసుకువచ్చారని వివరించారు. అయితే అధికార పార్టీకి చెందిన నేతలు కొంతమంది హైకోర్టు ఆర్డర్‌ను సైతం లెక్కచేయకుండా ఆ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించడంతో గ్రీన్ సిటీవాసులు అడ్డుకున్నారని, ప్రయివేటు వెంచర్‌లో ఉన్నస్థలాన్ని నగరపాలక సంస్థ ఇష్టారాజ్యంగా మరొకరికి కేటాయించడం కుదరదని ఖండించారు. ఈ విషయంలో న్యాయపరమైన పోరాటం చేస్తామని, అనవసరంగా అధికార పార్టీ నేతలు, నగరపాలక సంస్థ ముందుకు వస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని రమేష్ హెచ్చరించారు.

వైసిపి యువజన విభాగం మండల అధ్యక్షులుగా రాజా

ప్రజాశక్తి - ఉంగుటూరు

వైసిపి యువజన విభాగం మండల అధ్యక్షులుగా చేబ్రోలుకు చెందిన ఆకులరాజాను నియమిస్తూ పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనేపథ్యంలో రాజాను పలువురు అధికార పార్టీ నాయకులు, గ్రామస్తులు అభినందించారు. ఈ సందర్భంగా సోమవారం రాజా నివాసంలో సత్కరించారు. తనపై నమ్మకం ఉంచి రెండోసారి కూడా యువజన అధ్యక్షునిగా బాధ్యతలు అప్పగించిన ఎంఎల్ఎ వాసుబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని రాజా వెల్లడించారు.

నిధులు పక్కదారి.. అటకెక్కిన అభివృద్ధి

ఆర్థిక సంఘం నిధుల దారి మళ్లింపుపై టిడిపి ఆగ్రహం

ప్రజాశక్తి - ఉంగుటూరు

సర్పంచులకు తెలియకుండా ఆర్థిక సంఘాల నిధులను సిఎం తన పథకాలకు మళ్లించారని, దీంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందని, రానున్న ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెప్పాలని సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎంఎల్‌సి వైబివి.రాజేంద్రప్రసాద్ అన్నారు. చేబ్రోలులో టిడిపి సర్పంచులతో, గ్రామస్తులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడారు. ఉంగుటూరు నియోజకవర్గ టిడిపి సర్పంచుల సంఘం అధ్యక్షురాలు, చేబ్రోలు సర్పంచి రాందే లక్ష్మీసునీత అధ్యక్షత వహించారు. రాజ్యాంగబద్ధంగా రావాల్సిన పంచాయతీ నిధులను గ్రామాల్లో ఖర్చు పెట్టకుండా వైసిపి నేతల జేబుల్లోకి వెళుతున్నాయని రాజేంద్రప్రసాద్ విమర్శించారు. కేంద్రం ఇచ్చిన నిధులను సొంత పథకాలను మళ్లించారని, ఢిల్లీ పెద్దలకు చెప్పినా ఫలితం లేదన్నారు. గ్రామాల్లో సమావేశం నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గపు పాలనపై వివరిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షులు పిల్లి సత్తిరాజు మాట్లాడుతూ సర్పంచులు ఉత్సవ విగ్రహాల్లా మిగిలారని ఆవేదన వ్యక్తం చేశారు. లక్ష్మీసునీత మాట్లాడుతూ పంచాయతీ సిబ్బందికి, కార్మికులకు జీతాలు ఇచ్చుకోలేని దీనస్థితిలో ఉన్నామన్నారు. నారాయణపురం సర్పంచి అలకనంద మాట్లాడుతూ గ్రామానికి ఎంతో సేవ చేద్దామని వచ్చిన తమకు నిధుల లేమితో నిరాశే ఎదురైందన్నారు. ఛాంబర్ నాయకులు గోపాలరావు, వివిధ జిల్లాల నాయకులు మాట్లాడారు .కార్యక్రమంలో ఉంగుటూరు, సీతారామపురం, గొల్లగూడెం, సర్పంచులు సింధు, బళ్ళ రాధ, కరపా వెంకట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పండుగ రోజూ సమ్మెలోనే..

14వ రోజుకు అంగన్వాడీల సమ్మె - రోడ్లపైనే కేక్ కట్ చేసి ప్రత్యేక ప్రార్థనలు - పలుచోట్ల వినూత్న నిరసనలు

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో అంగన్‌వాడీల సమ్మె 14వ రోజు క్రిస్మస్ సందర్భంగా సమ్మె శిబిరాల వద్ద సోమవారం ప్రత్యేక ప్రార్థనలు చేసి నిరసన తెలిపారు. 'ఓ ప్రభువా మా సిఎంకు మంచి బుద్ధిని ప్రసాదించు.. మా సమస్యలు పరిష్కరించేలా చూడు' అంటూ వినూత్నంగా ప్రార్థనలతో హోరెత్తించారు. పలుచోట్ల ఒంటికాలిపై, చెవిలో పూలతో నిరసన తెలిపారు. అలాగే జిల్లావ్యాప్తంగా అంగన్వాడీలు క్రిస్మస్ రోజు కూడా సమ్మెను యథావిధిగా కొనసాగించారు. ప్రభుత్వం దిగొచ్చేవరకూ సమ్మెను ఆపేదిలేదంటూ వారంతా స్పష్టం చేశారు.

ఏలూరు : అంగన్వాడీల 14వ రోజు సమ్మెలో భాగంగా సోమవారం కలెక్టరేట్ వద్ద క్రిస్మస్ సందర్భంగా రోడ్డు మీద కేక్ కట్‌చేసి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. అంగన్వాడీలు నాలుగున్నరేళ్లుగా అనేకసార్లు సమస్యలు పరిష్కరించాలని అనేకసార్లు కోరినా

ఏలూరులో..

జగన్ ప్రభుత్వం స్పందించకపోవడం వల్లే సమ్మె చేపట్టారన్నారు. అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలు, రైతులు, కార్మికులు పనులకు వెళితే వారి పిల్లల్ని తల్లి మాదిరి అంగన్వాడీలు చూసుకుంటున్నారని గుర్తు చేశారు. అలాంటి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకపోవడం సిగ్గుచేటన్నారు. పండగపూట సంతోషంగా కుటుంబాలతో గడపాల్సిన రోజు రోడ్డుమీద పండగ చేసుకోవడం బాధాకరమన్నారు. జిల్లాలో అనేకచోట్ల అంగన్వాడీలను భయపెట్టేందుకు అంగన్వాడీ సెంటర్ల తాళాలు బద్దలు కొట్టి అన్యాయంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గత ఎన్నికల ముందు జగన్ ప్రభుత్వం అంగన్వాడీలకు తెలంగాణ కంటే అదనంగా జీతం ఇస్తామని హామీ ఇచ్చారని, ఐదేళ్లు గడుస్తున్నా హామీ అమలు చేయలేదని విమర్శించారు. పైగా ఎఫ్అర్ఎస్ యాప్‌ల పేరుతో పనిభారం పెంచారన్నారు. అంగన్వాడీ సెంటర్ అద్దెలు, గాస్ బిల్లులు సకాలంలో చెల్లించడం లేదన్నారు. నెలల తరబడి



నూజివీడులో..

బకాయిలుంటే అంగన్వాడీ కార్యకర్తలు వచ్చే కొద్దిపాటి జీతాలతో సెంటర్లు ఎలా నడుపుతారని ప్రశ్నించారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఐదేళ్లు ఎమ్మెల్యేగా పనిచేస్తే వారికి పెన్షన్ సౌకర్యం ఉందని, కానీ జీవితాంతం పనిచేసిన అంగన్వాడీలకు పెన్షన్ సౌకర్యం కల్పించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు టి.రజని, పి.హైమావతి, మల్లిక, అరుణకుమారి, నవతి, సిఐటియు నగర అధ్యక్షులు బి.జగన్నాధరావు, కార్యదర్శి వి.సాయిబాబు పాల్గొన్నారు.

పెదవేగి : 'ఓ ప్రభువా.. మా సిఎంకు మంచి బుద్ధిని ప్రసాదించు' అంటూ అంగన్వాడీలు క్రిస్మస్ సందర్భంగా ప్రార్థనలు చేస్తూ వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు పి.ప్రసాద్, టి.కృష్ణవేణి డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రూ.26 వేలు, గ్రాడ్యుటీ రూ.ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పండుగనాడు కూడా కుటుంబాలను వదిలిపెట్టి సమ్మె నిర్వహిస్తుంటే ప్రభుత్వం స్పందించకపోవడం

కలిదిండిలో ఒంటికాలిపై అంగన్వాడీల నిరసన

దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం కంటే అంగన్వాడీలకు రూ.వెయ్యి అదనంగా ఇస్తామని పాదయాత్రలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. కేవలం రూ.400 కోట్లు అదనంగా కేటాయిస్తే ముఖ్యమంత్రి హామీ అమలు చేయొచ్చని తెలిపారు. బైజుస్ వంటి కార్పొరేట్ కంపెనీలకు రూ.వేల కోట్లు కేటాయిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం అక్క చెల్లెమ్మల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. లబ్ధిదారులకు పంపిణీచేసే ఆహారానికి నాణ్యమైన సరుకులు ఇవ్వాలని కోరారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తామని, ఏడాది కిందట ఇచ్చిన హామీని అమలు చేయడం లేదని విమర్శించారు. ఈ శిబిరానికి వి.బేబీ, రాణి, కె.నిర్మల నాయకత్వం వహించారు.

చింతలపూడి : సిఎం జగన్ అంగన్వాడీల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్.నారాయణ అన్నారు. స్థానిక ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో 14వ రోజూ అంగన్వాడీల సమ్మె కొనసాగింది. క్రిస్మస్ సందర్భంగా సమ్మె శిబిరంలో క్రిస్మస్ కేకును కట్‌చేసి అంగన్వాడీల డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించేలా చూడాలంటూ ప్రార్ధనలు చేశారు. కుటుంబ సభ్యులతో అంగన్వాడీలు ఈ సమ్మెలో పాల్గొన్నారు. సరళ, మాణిక్యం పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల : అంగన్వాడీల గోడు ప్రభుత్వానికి పట్టడం లేదని అంగన్‌వాడీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రిస్మస్‌ను పురస్కరించుకుని స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు,హెల్పర్లు నిరసన తెలిపారు. తమ డిమాండ్లు నెరవేర్చే వరకూ సమ్మె ఆపే ప్రసక్తే లేదన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు తులసి, హైమావతి, నాగలక్ష్మి, అంగన్వాడీలు, హెల్పర్లు పాల్గొన్నారు.

నూజివీడు : అంగన్వాడీల సమ్మె 14వ రోజు యథావిధిగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు నూజివీడు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.ఆర్.హనుమాన్లు, జి.రాజు, అంగన్వాడిల యూనియన్ నాయకులు ఆదిలక్ష్మి జాన్సీ, మణి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

బుట్టయగూడెం : సిఎం జగన్ తమ సమస్యలను పరిష్కరించే బుద్ధిని ప్రసాదించాలంటూ క్రిస్మస్ సందర్భంగా అంగన్వాడీలు కేక్ కట్ చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్వాడీలు రోడ్లపైనే ప్రార్థన చేసి ప్రభుత్వం తమను రక్షించాలంటూ వేడుకున్నారు. 14 రోజులుగా కేంద్రాలను మూసివేసి సమ్మె చేస్తున్నప్పటికీ అక్క, చెల్లెమ్మలను ఆదుకునే విధంగా ముఖ్యమంత్రికి మంచి బుద్ధిని ప్రసాదించాలంటూ వినూత్నంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎం.నాగమణి, పుష్ప, రామలక్ష్మి, కృపామణి, నూర్జహాన్, మరమ్మ, ఆకాశమ్మ, మున్నీ పాల్గొన్నారు.

వేలేరుపాడు : మండలంలో అంగన్వాడీల సమ్మె 14వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా సమ్మె శిబిరంలో క్రిస్మస్ కేక్ కట్ చేసి నిరసన తెలిపారు. లబ్ధిదారులు, ప్రజలు, ప్రజా ప్రతినిధులు, ప్రజాసంఘాలు సహకరించాలని అంగన్వాడీలు విజ్ఞప్తి చేశారు.

నిడమర్రు : ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్వాడీల 14వ రోజు సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. శిబిరంలో అంగన్వాడీలు కేక్ కట్‌చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు కెవి.సత్యవతి, సుభాషిణి, అంబాల వరలక్ష్మి, జయమ్మ, సబీన పాల్గొన్నారు.

ఉంగుటూరు : అంగన్వాడీల సమ్మె 14వ రోజూ కొనసాగింది. ఈ సమ్మెను సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణరావు సందర్శించి సంఘీభావం తెలిపారు. నాయకులు సీర అప్పారావు, నాయకులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : అంగన్వాడీలు 14వ రోజు క్రిస్మస్‌ను పురస్కరించుకుని తహశీల్దార్ కార్యాలయం ఎదుట ప్రార్థనలు చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రిస్మస్‌ను ఇళ్ల వద్ద పిల్లపాపలతో మందిరాలకు వెళ్లి ప్రార్థనలు చేసుకోకుండా నిరసన కేంద్రాల వద్దనే చేసుకోవడం ఆవేదన కలిగించిందన్నారు. సిఎం జగన్ స్పందించి సమస్యలు పరిష్కరించాలన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సమ్మెకు సిఐటియు నేతలు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కొండలరావు, అంగన్వాడీలు నాగమణి, ఎస్తేరు, సరళ, పూర్ణ పాల్గొన్నారు.

కొయ్యలగూడెంలో చెవిలో పువ్వులతో నిరసన

కొయ్యలగూడెం : అంగన్‌వాడీలు స్థానిక సమ్మె శిబిరం వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తూ నిరసన తెలిపారు. అనంతరం చెవిలో పువ్వు పెట్టుకుని నిరసన తెలిపారు. సహకార సంఘ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కెవివి.సత్యనారాయణ సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు అబ్బిన సత్యవతి, సిఐటియు నాయకులు ఎస్.రాంబాబు, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు శివ రత్నకుమారి, అడపా నాగజ్యోతి, జయ నాగవేణి, షేక్ నూర్జహాన్, పద్మజ, శిరీష పాల్గొన్నారు.

కలిదిండి : స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 14వ రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఒంటికాలిపై దండం పెడుతూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీల యూనియన్ నాయకులు షేక్ అబిదాబేగం, జక్కంశెట్టి మేనకలక్ష్మి, కొప్పినీడి రమాదేవి, అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

ముదినేపల్లి : అంగన్వాడీల నిరవధిక సమ్మె 14వ రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా పలువురు అంగన్వాడీలు మాట్లాడుతూ సిఎం జగన్ స్పందించి తమ సమస్యలు పరిష్కారించాలన్నారు. లేనిపక్షంలో సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

టి.నరసాపురం : సిఎం జగన్ స్పందించి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రత్యేక ప్రార్థనల ద్వారా నిరసన తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన సమ్మె శిబిరంలో క్రిస్మస్‌ను పురస్కరించుకుని కేకు కట్ చేశారు.

జంగారెడ్డిగూడెం : అంగన్వాడీల సమస్యలను పరిష్కరించడంలో సిఎం జగన్ మనసు మారాలని కోరుతూ అంగన్వాడీలు ప్రార్థనలు చేశారు. అంగన్వాడీలు 14వ రోజు సమ్మె శిబిరం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో పసల సూర్యారావు అధ్యక్షతన ప్రార్థనలు చేశారు. అలాగే మందార పూలతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు షేక్ సుభాషిని, అంగన్వాడీల యూనియన్ మండల అధ్యక్షులు లక్ష్మీదేవి, కార్యదర్శి సత్యవేణి, జగదీశ్వరి, షకీలా భాను, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

చింతలపూడిలో..

రూ.367.08 కోట్లు రైతుల ఖాతాల్లో జమ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

జిల్లాలో ధాన్యం విక్రయించిన 34,041 మంది రైతులకు రూ.367.08 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశామని జెసి లావణ్య వేణి తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సోమవారం జెసి మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 5.66 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని ప్రాథమికంగా అంచనా వేసామన్నారు. జిల్లాలోని 251 రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించి 21 రోజుల వ్యవధిలో ధాన్యం డబ్బు ఖాతాల్లో వేస్తున్నామన్నారు.

జనవరిలో టిడిపిలోకి పలువురు

జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు

ప్రజాశక్తి - భీమడోలు

జనవరిలో టిడిపిలోకి పలువురు చేరనున్నారని ఆ పార్టీ ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు తెలిపారు. భీమడోలులోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఉంగుటూరు మండలం వి.ఎ.పురం గ్రామ సర్పంచి సింగలూరు ధర్మారావుతో పాటు అదే గ్రామానికి చెందిన ప్రముఖులు కోకా సత్యనారాయణ, ఇతరులు పార్టీలో చేరారు. పార్టీ కండువాలతో వీరిని సత్కరించిన గన్ని వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సిరిబత్తిన కొండబాబు, దూసనపూడి పుల్లయ్య నాయుడు, అధిక సంఖ్యలో ఉంగుటూరు మండలానికి చెందిన టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి వాజ్‌పేయి : కామినేని

ముదినేపల్లి : మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి దేశం గర్వించదగ్గ అత్యుత్తమ వ్యక్తి అని మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ అన్నారు. సోమవారం ముదినేపల్లిలోని గురజ రోడ్ సెంటర్‌లో జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెండా దిమ్మను మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ దేశ ప్రధానిగా, ఉత్తమ పార్లమెంటేరియన్‌గా వాజ్‌పేయి దేశానికి ఎన్నో సేవలు అందించారన్నారు. వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలను వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ముదినేపల్లి మండల అధ్యక్షులు సత్యవోలు నాగలక్ష్మి, పైడిపాటి శివశంకర్, వైవాక మాజీ సర్పంచి లక్ష్మీపతి రాజు, జిల్లా మహిళా విభాగ ఉపాధ్యక్షురాలు రెడ్డి రాధిక పాల్గొన్నారు.

కలిదిండి : కలిదిండిలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళు లర్పించారు. జిల్లా మెడికల్ సెల్ కన్వీనర్ బండారు వెంకటరాజు, నాయకులు చక్కా జగన్మోహనరావు, ఎన్‌విఎల్ఎన్.మూర్తి పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ఆగి ఉన్న లారీని ఢీకొని మహిళ దుర్మరణం

ప్రజాశక్తి - ఉంగుటూరు

216వ జాతీయ రహదారి ఉంగుటూరు టోల్‌ప్లాజా సమీపంలో సోమవారం రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం చెందినట్లు చేబ్రోలు ఎస్ఐ ఎ.మణికుమార్ తెలిపారు. భీమడోలుకు చెందిన గాయత్రి తన ఆరేళ్ల కుమారుడితో తాడేపల్లిగూడెం ద్విచక్రవాహనం మీద వెళ్లి తిరిగి వస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. రోడ్డు పక్కన ఆపి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొనడంతో గాయత్రి(29) తలకు తీవ్రగాయాలతో రోడ్డుమీద పడిన ఆమెను హైవే అంబులెన్స్ ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించే సరికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు వెల్లడించారని పోలీసులు చెప్పారు. బైక్ వెనుక కూర్చున్న బాలుడు క్షేమంగా ఉన్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

ఊక లోడు లారీ బోల్తా

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఊక లోడుతో వెళుతున్న లారీ పల్టీ కొట్టిన ఘటన మండలంలోని పెదపాలపర్రు వద్ద ఆదివారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే ముదినేపల్లి నుంచి గుడివాడ వైపు ఊకలోడుతో వెళుతున్న లారీ పెదపా లపర్రు సమీపంలో గుంతలో పడి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో లారీలో ఉన్న వ్యక్తులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఊక రోడ్డుపై అడ్డంగా పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఆటో-బైక్ ఢీ : విద్యార్థి మృతి

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఆటో, బైకు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో బైకిస్టు మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో ముదినేపల్లి-బంటుమిల్లి రోడ్‌లో జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం మండలంలోని శ్రీహరిపురం బిసి కాలనీకి చెందిన శొంఠి గణేష్(17) అనే విద్యార్థి ముదినేపల్లి నుంచి బైక్‌పై శ్రీహరిపురం వెళుతున్నాడు. అదే సమయంలో సింగరాయపాలెం నుంచి ముదినేపల్లి వైపు వస్తున్న ఆటో, బైకు కోమర్రు రోడ్డు సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న విద్యార్థి గణేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు గణేష్ ఇంటర్ పూర్తి చేసి జనవరిలో జరిగే మెయిల్స్‌కి ప్రిపేర్ అవుతున్నట్లు తెలిసింది. గణేష్ అకాల మరణంతో బిసి కాలనీలో విషాదఛాయలు అలముకున్నాయి.

చెక్‌పోస్ట్ వద్ద వాహన తనిఖీలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని తాటియాకులగూడెం అంతర్ రాష్ట్ర సరిహద్దు తనిఖీ కేంద్రం వద్ద సోమవారం సాయంత్రం ఎస్ఐ వి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. సరైన వాహన ధృవపత్రాలు లేకుండా వాహనాలు నడిపే వాహన దారులకు జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. అనంతరం సరిహద్దు గుండా డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహన దారులు మద్యం తాగి వాహనాలు నడపకూడదని వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

కాలువలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన భోగాపురం శివారులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు పెన్షన్ లైన్ ప్రాంతానికి చెందిన షేక్ అబ్దుల్(34) ప్రస్తుతం తాడేపల్లిగూడెం యూనియన్ ఆసుపత్రిలో వార్డుబాయ్‌గా పనిచేస్తూ జీవనాన్ని సాగిస్తున్నాడు. దెందులూరు మండలం భోగాపురం గ్రామానికి చెందిన మహిళతో గత కొంతకాలంగా సహజీవనం చేస్తున్నాడు. ఈ క్రమంలో వీరంతా కలిసి తాడేపల్లిగూడెంలోనే ఉంటున్నారు. క్రిస్మస్ పండుగ నేపథ్యంలో అతను మహిళను తన పుట్టింటి వద్ద వదిలి ఆదివారం రాత్రి సరదాగా స్నేహితులతో పార్టీకి బయలుదేరి వెళ్లాడు. తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో కూడా మహిళ అతనికి ఫోన్ చేసి ఇంటికి రమ్మని అడగగా చిన్న పార్టీలో ఉన్నానని వచ్చేస్తానని ఆమెకు తెలిపాడు. తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో తిరిగి ఆమె అబ్దుల్‌కు ఫోన్ చేయగా అప్పటి నుంచి అతను ఫోను తీయ లేదు. సోమవారం ఉదయం భోగాపురం గ్రామానికి చెందిన స్థానికులు అటుగా వెళుతూ కాలువలో పడి ఉన్న అబ్దుల్ మృతదేహాన్ని గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో దెందులూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై దెందులూరు ఎస్ఐ కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మధ్యమధ్యలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కాలువల పడి ఉండవచ్చునని పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు.

పేకాటరాయుళ్లు అరెస్ట్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పేకాట ఆడుతున్న ఇంటిపై పోలీసులు దాడి చేసి నలుగురిని అరెస్టు చేసినట్లు మూడో పట్టణ పోలీసులు తెలిపారు. ఏలూరు నగరంలో మూడో పట్టణ పరిధిలోని శాంతినగర్ ఇంటిలో సోమవారం రాత్రి పేకాట నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు సిఐ వెంకటేశ్వరరావు తన సిబ్బందితో కలిసి ఆ ఇంటిపై దాడి చేసి పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులకు తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.15,300ల నగదును స్వాధీనం చేసుకున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

కాలుష్య కోరల్లో పంట కాలువలు

పంట కాలువల్లోకి మొలాసిస్

దుర్గంధంతో ప్రజల అవస్థలు

మత్స్య సంపద మృత్యువాత

పట్టించుకోని అధికారులు

ముదినేపల్లిలోని పోల్‌రాజ్ కెనాల్‌లో వ్యర్థాలతో కూడిన నీరు

ప్రజాశక్తి - ముదినేపల్లి

కాలుష్య కోరల్లో పంట కాలువలు చిక్కుకున్నాయి. మండలంలోని ప్రధాన పంట కాలువలైన పోల్‌రాజు కెనాల్, సిబి కెనాల్ పంట కాలవల్లో గత ఐదు రోజులుగా ఎగువ నుంచి వస్తున్న వివిధ ఫ్యాక్టరీల వ్యర్థాలతో కలిసిన నీటిని పోల్‌రాజ్, సిబి కెనాల్ పంట కాలువల్లోకి గుడ్లవల్లేరు లాకులు వద్ద నుంచి ముదినేపల్లిలోని పంట కాల్వలకు అధికారులు వదులుతున్నారు. దీంతో ఆ నీరు పంట కాల్వల ఆయుకట్టు గ్రామాల్లోకి చేరుతుంది. కాలువ ఆయకట్టు గ్రామాల్లోని నివాసితులకు, కాలువ గట్ల వెంట వెళ్లే రైతులు, ప్రజలకు దుర్గంధం వెదజల్లుతోంది.

అంతేకాక పంట కాలువల్లో సహజ సిద్ధంగా పెరిగే మత్స్య సంపద కూడా ఈ కాలుష్య నీటికి మృత్యువాత పడుతుంది. అలాగే పంట కాలువల్లో కలుషిత నీరు తాగిన పశువులు, జీవాలు కూడా రోగాల బారిన పడుతున్నాయి. ఈ మొలాసిస్ నీరు తాగిన పశువులు, జీవాలు నెలలు నిండక ముందే దూడలను బయట పడేస్తున్నాయి. ఉయ్యూరు వద్ద ఉన్న చెరకు ఫ్యాక్టరీ నుంచి వ్యర్థాలతో కూడిన మొలాసిస్ నీరు వదులుతున్నట్లు రైతులు చెబుతున్నారు. ఫ్యాక్టరీ నుంచి బయటకు విడుదల చేసే మొలాసిస్ నీరు పోయేందుకు చంద్రయ్య మురుగు కాలువ ఉండగా, పంటకాల్వలలోకి మొలాసిస్ నీటిని వదలడం ఏమిటని ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారు. చెరకు ఫ్యాక్టరీని శుభ్రం చేయగా వచ్చిన నీటిని ఫ్యాక్టరీ యాజమాన్యం పుల్లేరులోకి వదిలివేయడంతో ఆ నీరు గుడ్లవల్లేరు లాకుల వద్దకు చేరుతుంది. లాకుల వద్దకు చేరిన నీటిని అధికారులు మండలంలోని ప్రధాన రెండు పంట కాలవలోకి వదిలేయడంతో పంట కాలువలు కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయి. దీంతో చేపలు, పశువులు, జీవాలు రోగాల బారిన పడుతున్నట్లు పశు పోషకులు చెబుతున్నారు. చేపలు, జీవాల పరిస్థితే ఈ విధంగా ఉంటే.. కలుషిత నీరు గ్రామాల్లోని మంచినీటి చెరువుల్లోకి, ఆక్వా చెరువుల్లోకి చేరితే ప్రజా ఆరోగ్యానికి ఉప్పు తప్పదని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఈ కాలుష్య నీటి వల్ల పంట కాలవలోని నల్ల జాతి చేపలు, నాటు గురకలు, వాలుగల చేపలు, తెల్ల చేపలు మృత్యువాత పడుతున్నాయి. చేపలు మృతి చెందే ముందు గట్ల వారగా ఈదడంతో కొందరు వాటిని పట్టుకునేందుకు ఎగబడుతున్నారు. ఇలా దొరికిన చేపలను

పై నుంచి వదులుతున్నారు

సిద్ధార్థ,
సిబి కెనాల్ ఎఇఇ

పంట కాలవల్లోకి మొలాసిస్ నీరు వస్తున్న మాట వాస్తవమే. ఆ నీరు పైనుంచి వస్తుంది. గుడ్లవల్లేరు లాకుల నుంచి అధికారులు మొలాసిస్ నీటిని ముదినేపల్లి మండలంలోని పంట కాలవల్లోకి వదులుతున్నారు. ఇది మా పరిధిలో లేదు.

కుల, మతాలకతీతంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలో వినూత్న రీతిలో త్రైత సిద్ధాంతం ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం తెల్లవారుజామున కేక్ కట్ చేసి ఏసుక్రీస్తు స్తుతి గీతాలు ఆలపించారు. క్రిస్మస్ ఒక క్రైస్తవ పండగ మాత్రమే కాదని అన్ని మతాలకు చెందిందని చర్చిలో పలువురు తెలిపారు. హిందూ, ముస్లిం సోదరులు ఐక్యమత్యంతో పండగను ఘనంగా చేసుకున్నారు.

చింతలపూడి : మండలంలో ఘనంగా క్రిస్మస్ పండుగ వేడుకలు జరిగాయి. చింతలపూడి మండలం ముక్కంపాడు గ్రామంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో దేవాలయాలలో విశ్వాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్రదర్ తంబి మాట్లాడుతూ అందరూ సమానమే అని కలిసి కట్టుగా ఎదుటి వారికి సహాయపడేటట్లు ఉండాలని అన్నారు. క్రైస్తవులందరూ అందరకీ ఆదర్శంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు.

మండవల్లి : ఏసుక్రీస్తు పుట్టినరోజు క్రిస్మస్ వేడుకను క్రైస్తవ సహోదరులు సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు. క్రిస్మస్ పురష్కరించుకుని ప్రార్థనా మందిరాలను రంగులు, డెకరేషన్లు, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. డిసెంబర్ 25 క్రీస్తు పుట్టుక పురస్కరించుకుని సోమవారం తెల్లవారుజామునే యువకులు ఏసుక్రీస్తు పుట్టాడు.. లేవండోయ్ అంటూ గ్రామ వీధులలో వాయిద్యాలు వాయిస్తూ.. పాటలు పాడుతూ క్రీస్తు పుట్టుక శుభాకాంక్షలు తెలియజేస్తూ సందడి చేశారు. అనంతరం ఉదయం 10 గంటలకు ప్రార్థనా మందిరాలకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెూలీ ఆర్మీ ఫెలోషిప్ అమ్మ రాణి అబ్రహం మాట్లాడుతూ ఏసుక్రీస్తు పాపంతో నశించిపోతున్న మానవాళిని రక్షించడానికి మానవ రూపంలో కన్య మరియ గర్భాన జన్మించడం జరిగిందన్నారు. అనంతరం హ్యాపీ హ్యాపీ క్రిస్మస్.. మేరి మేరి క్రిస్మస్ అంటూ కరచాలనం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేసి, మిఠాయిలను పంపిణీ చేశారు.

ముదినేపల్లి : మండలవ్యాప్తంగా క్రైస్తవులు క్రిస్మస్ పర్వదినాన్ని సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆదివారం రాత్రి 10 గంటల నుంచి ప్రారంభమైన క్రిస్మస్ ప్రత్యేక కార్యక్రమాల వేడుకలు సోమవారం రాత్రి వరకు మండలంలో జరిగాయి. ముదినేపల్లితో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లోని ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ఆరాధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీస్తు జననం గూర్చి పాస్టర్లు విశ్వాసులకు బోధించారు. క్రిస్మస్ సందర్భంగా చర్చిలన్నీ యువతీ, యువకులు, పెద్దలు, చిన్నలు, మహిళలతో కిట కిటలాడాయి. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో చర్చిల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు, అన్న సమారాధనలు నిర్వహించారు.

ఆగిరిపల్లి : మండల పరిధిలోని పలు చర్చిల్లో క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కనసానపల్లి పరిశుద్ధ పౌల్ సిఎస్ఐ దేవాలయంలో పాస్టర్ కె.ఐజక్‌జాన్ ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. క్రీస్తు మార్గంలో నడిచిన వారికి శాంతి, సమాధానం చేకూరుతుందని వివరించారు. క్రిస్మస్ ప్రత్యేక కేక్‌ను కోసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ శశిధర్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : మండల వ్యాప్తంగా సోమవారం క్రిస్మస్ పర్వదినం సందర్భంగా క్రీస్తు జన్మదిన వేడుకలను క్రైస్తవ సోదరులు ఘనంగా నిర్వహించారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో వున్న ఆర్‌సిఎమ్ చర్చిలో సొసైటీ అధ్యక్షులు కొల్లూరి రాంబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేసి, అనంతరం కేక్ కటింగ్ చేశారు. జీలుగుమిల్లిలోని గ్రేస్ మందిర్‌లో పాస్టర్ ఎజ్రాశాస్త్రి ఆధ్వర్యంలో క్రీస్తు జన్మదిన వేడుకలను నిర్వహించి, అనంతరం మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కామయ్యపాలెం, ములగళంపల్లి, దర్భగూడెం గ్రామల్లోని పలు దేవాలయాల్లో కూడా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పలు దేవాలయాల వద్ద అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ ఫాధర్ ఆనంద్, మాస్టర్ ఏసురత్నం, పాస్టర్‌లు ఎజ్రాశాస్త్రి, జాన్సన్, శ్రీను, సంఘ పెద్దలు యేసు, రవీంద్ర, చిన్న, వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : హిందూ, ముస్లీం, క్రైస్తవులు కలిసి కేక్ కట్ చేస్తూ..

కలిదిండి : మండలంలోని మద్దవానిగూడెం, కోరుకొల్లు, భాస్కరరావు పేట, పెదలంక, మట్ట గుంట, తాడినాడ, కొండూరు, పోతుమర్రు, గొల్లగూడెం, ఇందిరాకాలనీ, సానారుద్రవరం గ్రామాల్లోని ఆర్‌సిఎం చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కలిదిండి ఆర్‌సిఎం చర్చిలో రెవరెండ్ ఫాధర్ బంటుమిల్లి హెూహాను ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఆరుతెగలపాడు హెూసన్న ప్రార్థనా మందిరంలో కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో సంఘ పెద్దలు, సంఘస్తులు పాల్గొన్నారు.

టి.నరసాపురం : క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలో సోమవారం ప్రార్థనా మందిరాల్లో క్రైస్తవ విస్వాసులు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రధానంగా మండలంలోని బొర్రంపాలెం, మక్కినవారిగూడెం, మర్రి గూడెం, టి.నరసాపురం, పుట్రేవు, ప్రకాష్ నగర్, రుద్రకోటరాజుగూడెం, గం డిగూడెం తదితర గ్రామాల్లో పాస్టర్లు, క్రైస్తవ విశ్వాసులు కలిసి క్రీస్తు పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఆయా సంఘాలలో స్వీట్లు పంచి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా వృద్ధులు, వితంతువులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో పాస్టర్లు వాక్యము బోధించారు. సమాజంలో శాంతిని స్థాపించడానికి యేసు క్రీస్తు ప్రభువు భూమిపై జన్మించారని, ఆయన బోధనలు అనుసరణీయమని అన్నారు. ప్రతి ఒక్కరూ తోటి వారి పట్ల ప్రేమ, సేవాభావం కలిగి ఉండాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో పాస్టర్లు జి.జ్ఞాన్ రాజు, కె.నిరీక్షణ రావు, సిహెచ్.హెూషేయ, సిహెచ్.రమేష్, టి.ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

ముసునూరు : మహోన్నత సందేశాలను తన జీవితం ద్వారా మానవాళికి క్రీస్తు అందించారని, యేసు ప్రభువు బోధనలు శాంతి, ప్రేమ, సౌభ్రాతృత్వం, సహనం, మంచి అలవాట్లు అలవర్చుకోవాలని మండల ప్రజలు సోమవారం క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని 16 గ్రామాల్లో పాస్టర్లు పాల్గొని కేక్ కట్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఫాదర్స్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రీస్తు జన్మదినం క్రైస్తవులకు అత్యంత సంతోషకరమైన రోజు అన్నారు. క్రీస్తు దీవెనలు అందరికీ చేకూరాలని.. ప్రతిఒక్కరూ ఆనందంగా జీవించాలని ఆ ప్రభువును వేడుకున్నారు.

పోలవరం : కొవ్వొత్తులతో సండే స్కూల్ చిన్నారులు

ద్వారకాతిరుమల : ద్వారకా తిరుమల మండలం దొరసానిపాడు గ్రామంలో సోమవారం సాయంత్రం క్రిస్టమస్ సందర్భంగా మేరీ మాత గోపురం ఊరేగింపు క్రైస్తవులు అంగరంగ వైభవంగా బాణాసంచా కాల్చుతూ, క్రీస్తును స్మరిస్తూ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాళ్లకుంట విచారణ గురువులు ఫాదర్ కాకి చార్లెస్ శుభ వచనాలు అందించారు. ఈ ఊరేగింపు కార్యక్రమంలో క్రైస్తవులు గ్రామస్తులు పాల్గొన్నారు.

పోలవరం : మండలంలో పలు గ్రామాలైన పోలవరం, పట్టిసీమ, కొత్త పట్టిసీమ గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొత్త పట్టిసీమ గ్రామంలో పాస్టర్ డి.ఆశీర్వాదం ప్రత్యేక ప్రార్థనలు చేసి క్రీస్తు యేసు జన్మ దినోత్సవంను ఘనంగా జరుపుకుంటామని అన్నారు. సండే స్కూల్ పిల్లల ఆట పాటలతో క్రిస్మస్ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ క్రిస్మస్ వేడుకలో సిఆర్‌డి ఇమ్మానియేలు, చర్చి డెలిగేట్ జి.అబ్రహం, సండే స్కూల్ పిల్లలు, సంఘస్తులు, పెద్దలు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో విచ్చలవిడిగా వున్న మందు బాటిళ్లు

బస్టాండ్ కుర్చీ బల్ల కింద పడివున్న మందు సీసాలు

మందుబాబులకు అడ్డాగా బస్ షెల్టర్

ప్రయాణికుల ఇబ్బంది : గామస్తుల ఆందోళన

ఆకతాయిల ఆగడాలు అరికట్టాలని పలువురు వేడుకోలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ప్రయాణికులకు విశ్రాంతి భవనంగా వుండాల్సిన బస్ షెల్టర్ కాస్తా మందు బాబులకు అడ్డాగా తయారైంది. మండలంలోని ములగలంపల్లి గ్రామంలో ప్రయాణికుల సౌకర్యార్థం గ్రామానికి చెందిన దూపకుంట్ల సత్యనారాయణ కుటుంబీకుల జ్ఞాపకార్థం నాలుగు సంవత్సరాల క్రితం బస్ షెల్టర్ నిర్మించారు. అప్పటి నుంచి ప్రయాణీకులు వాహనాలు లేట్‌గా వచ్చే సమయంలో బస్ షెల్టర్‌లో విశ్రాంతి తీసుకునేవారు. అయితే గత కొంతకాలంగా గ్రామంలో ఉండే ఆకతాయిలు వేరే ప్రదేశాల నుంచి మందు తెచ్చుకొని బస్ షెల్టర్‌ను కాస్త మందు తాగేందుకు అడ్డాగా ఏర్పాటు చేసుకున్నారని పలువురు విమర్శిస్తున్నారు. బస్ షెల్టర్‌లోనే మందు దుకాణం పెట్టి సీసాలు కూడా అక్కడే పడేస్తుండటంతో ప్రయాణీకులు అందులో విశ్రాంతి తీసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఆకతాయిల ఆగడాలను అరికట్టాలని పలువురు వేడుకుంటున్నారు.

దాతల భాగస్వామ్యం అభినందనీయం

శాంతి రథాల విభాగం ఛైర్మన్ రాంబాబు

ప్రజాశక్తి - భీమడోలు

స్వచ్ఛంద సంస్థ మానవత భీమడోలు శాఖ చేపడుతున్న సాంఘిక, సేవా కార్యక్రమాల్లో దాతలు భాగస్వాములు కావటం అభినందనీయమని సంస్థ జిల్లా శాంతి రథాల విభాగం ఛైర్మన్ అప్పక రాంబాబు అన్నారు. భీమడోలుకు చెందిన దాతలు గుళ్ల ఆదిలక్ష్మి, గుళ్లకృష్ణ చైతన్య తమ పూర్వీకులు గుళ్ల అప్పల స్వామి, అచ్చాయమ్మ దంపతుల సంస్మరణార్థం రూ.75 వేల విలువ గల శవాలను భద్రపరిచే ఫ్రీజర్ను భీమడోలు మానవత శాఖకు సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అందజేశారు. దీనిని సంస్థ జిల్లా కార్యవర్గ సభ్యులు అప్పక రాంబాబు, రామిశెట్టి గంగాధర రావు చేతుల మీదుగా శాఖ ఛైర్మన్ గుళ్ల నూకరాజు, ఇతర సభ్యులు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ మానవత ద్వారా రాష్ట్ర పరిధిలోని 110 మండలాల్లో సేవా సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలియజేశారు.



శవాలను భద్రపరిచే ఫ్రీజర్‌ను స్వీకరిస్తున్న శాఖా సభ్యులు

CHANGE OF NAME

I, **CHENNU VENKATA RANGA** S/o. Chennu Venkata Reddy, D.No. 17-1-160, Kothapalli vari street, Rusthumbada, Narasapuram, -534275, W.G.Dt. A.P. I have changed my name from **CHINNU VENKATA RANGA** (Old name) to **CHENNU VENKATA RANGA** (New name) hence forth I am being called **CHENNU VENKATA RANGA** S/o. Chennu Venkata Reddy, for all purposes

CHANGE OF NAME

I, **CHENNU VENKATA KRISHNA RAJAJI** S/o. Chennu Venkata Ranga, D.No. 17-1-160, Kothapalli vari street, Rusthumbada, Narasapuram, -534275, W.G.Dt. A.P. I have changed my name from **CHINNU VENKATA KRISHNA RAJAJI** (Old name) to **CHENNU VENKATA KRISHNA RAJAJI** (New name) hence forth I am being called **CHENNU VENKATA KRISHNA RAJAJI** S/o. Chennu Venkata Ranga, for all purposes

CHANGE OF NAME

I, **CHENNU VENKATA LAKSHMI SATYAVATHI** W/o. Chennu Venkata Ranga, D.No. 17-1-160, Kothapalli vari street, Rusthumbada, Narasapuram, -534275, W.G.Dt. A.P. I have changed my name from **CHINNU VENKATA LAKSHMI SATYAVATHI** (Old name) to **CHENNU VENKATA LAKSHMI SATYAVATHI** (New name) hence forth I am being called **CHENNU VENKATA LAKSHMI SATYAVATHI** W/o. Chennu Venkata Ranga, for all purposes